తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

## శ్రీవారిని దర్శించుకున్న నారా భువనేశ్వరి



కుప్పం, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త

కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని బుధవారం సిఎం చంద్ర బాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజి ంగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి దర్శించుకు న్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు నారా భువనేశ్వరికి సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికి స్వామివారి దర్శనం కల్పించారు. తిరుమలలో నారా భువనమ్మను ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఎపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, సిఎం పిఎ శ్రీకాంత్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## బ్యాంకులో బంగారం మాయం..!

### - కస్టమర్ చేతివాటం, 60 గ్రాములు అపహరణ



తిరుపతి రూరల్, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త :

ఆంధ్ర బ్యాంక్ లో బంగారం చోరీ ఘటన కలకలం రేపింది. తిరుపతి రూరల్ మండలంలోని అవిలాల ఆంధ్ర గ్రామీణ బ్యాంకులో కుదువ పెట్టిన బంగారం రెన్యువల్ కోసం వచ్చిన మహిళకు చెందిన సుమారు 60 గ్రాముల బంగారం అపహరణకు గురైనట్లు పోలీసులు తెలిపారు. బ్యాంకులో అప్రైజర్ బంగారాన్ని తనిఖీ చేస్తున్న సమయంలో, ఓ వ్యక్తి న్యూస్‌పేపర్‌ను అడ్డుగా పెట్టుకొని చాకచక్యంగా ఆభరణాలను తీసుకుని పరారైనట్లు సమాచారం. ఈ ఘటనతో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బ్యాంకు మేనేజర్ గిరీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనపై ఎస్ఐ శ్రీరామ్ విచారణ చేపట్టారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుడి ఆనవాళ్ల కోసం గాలిస్తున్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో విలువైన వస్తువులతో లావాదేవీలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## వైభవంగా ధ్వజావరోహణం

కాణిపాకం, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్స వాలలో భాగంగా బుధవారం రాత్రి ధ్వజావరోహణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈనెల 14 నుండి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా 15న ధ ్వజారోహణంతో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈఉత్సవాలు బుధవారం జరిగిన ధ్వజావరోహణంతో ముగిసింది. ఈమేరకు నవరాత్రి ఉత్సవాలు దిగ్విజయంగా నిర్వహిం చేందుకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ఈనెల 15న ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొమ్మిది రోజులు అనంతరం బుధవారం ధ్వజావ రోహణం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్ర మానికి దేవస్థానం ఉభయదారులుగా వ్యవహరిం చారు. ఈసందర్భంగా ఉభయదారులచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించిన అనంతరం ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థం భంపై ఎగుర వేసిన మూషికపటాన్ని శాస్త్రోక్తంగా పూజల అనంతరం అవతనం గావించారు. ఈ సందర్భంగా మూషిక పటానికి పూజలు నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.మణి నాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్ ఆలయ సూపరెండెంటలు వాసు,కోడండపాణి, టెం పుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవిలతో పాటు ఉత్సవఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో కన్నుల పండువగా త్రిశూలస్నానం





కాణిపాకం, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలో భాగంగా నవరాత్రి ఉత్సవాల చివరిరోజు బుధవారం త్రిశూలస్నానం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో ఈనెల 15నుండి ప్రారంభమైన స్వామివారి నవరాత్రి ఉత్సవాలు బుధవారం జరిగిన ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవతో ముగిసింది. నవరా త్రి ఉత్సవాల అంకురార్పణ సందర్భంగా ప్రధాన ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో నవదాన్యాలను మొలకపోసి, అష్టోత్తర కలశాలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో యాగశాల పూజలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా స్వామివారి ఆయుధమైన త్రిశూలాన్ని స్వామివారు వాహనసేవల్లో ఊరేగే కాణిపాకం పురవీధుల్లో ప్రతిరోజూ ఉదయం ఊరేగిస్తుంటారు. స్వామివారి నవరాత్రి ఉత్సవాలు ముగిసినందున త్రిశూల స్నానం గావించారు. తిరుమల చక్రస్నానం తరహాలో కాణిపాకంలో త్రిశూల స్నానం ఘట్టం జరిగింది. పూర్ణాహుతి అనంతరం త్రిశూలాన్ని కాణిపాకం పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలోని నీటిలో త్రిశూలస్నానం గావించారు. ఈసందర్భంగా యాగశాలలోని అష్టోత్తర కలశాలలోని పవిత్రజలంతో త్రిశూలానికి అభిషేకం గావించారు. అలాగే అంకురార్పణ రోజున మొలకపోసిన నవదాన్యాలను పుష్కరిణిలో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్ దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్ ఆలయ సూపరెండెంట్‌లు వాసు,కోడండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజి నాయుడు, రవిలతో పాటు ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల పుణ్యస్నానాలతో

## ముగిసిన చక్రస్నానమహోత్సవం

### గోవింద నామస్మరణతో పులకించిన పుష్కరిణి



తిరుమల, సెప్టెంబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగవైకుంఠం తిరుమలలో తొమ్మిదిరోజులు జరిగిన శ్రీవారి సాలకట్లవార్షిక బ్రహ్మోత్సవాలు చివరిరోజు బుధవారం ఉదయం చక్రధారుడి చక్రస్నాన మహోత్సవం వైభవంగా ముగిశాయి. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు. ఉదయం 6గంటలనుండి 9గంటలవరకు భూవరాహస్వామి ఆలయం ముఖమండపంలో శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామికి శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో ముందుగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ,ముఖప్రక్షాళన, దూపదీపనైవేద్యం,రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాదనివేదనలో భాగంగా పాలు,తేనె, కొబ్బరినీళ్ళు ,పసుపు,గంధంతో స్నపనం నిర్వహించారు. అభిషేకానంతరం వివిధ పాశురాలను పెద్దజియ్యర్‌స్వామి, చిన్నజియ్యర్‌స్వామి పఠించారు. చక్రస్నానం లో శ్రీవారి సుదర్శనచక్రంకు పుష్కరిణిలో స్నానం నిర్వహించే ముందు భూసమేత మలయప్పస్వామి వారికి స్నపనతిరుమంజనం నిర్వహించారు. చక్రస్నానసమయంలో అర్చకులు కర్పూరహారతులిచ్చారు. అదే సమయంలో భక్తులు పుష్కరిణిలో గోవిందనామాలతో పుణ్యస్నానాలాచరించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఈఓముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యులు, అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈఓలు డాక్టర్ ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సివిఎస్ఓ కే.వి. మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, టిటిడి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌పై

## నిరంతర నిఘా

### ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్, జిల్లా ఎస్పీ

రేణిగుంట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:



ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఈవీఎం యంత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద 24 గంటలూ నిరంతర నిఘా కొనసాగిస్తూ, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్వహిస్తున్న త్రైమాసిక తనిఖీల్లో భాగంగా బుధ వారం రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో భద్రపరిచిన ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుతో కలిసి ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, సీలింగ్ విధానం, భద్రతా ఏర్పాట్లు, స్ట్రాంగ్‌రూమ్ పరిసరాల్లో చేపడుతున్న నిఘా తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎం యంత్రాల భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. స్ట్రాంగ్‌రూమ్ పరిసరాల్లో నిరంతరం భద్రత కొనసాగించాలని, సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షి ంచాలని ఆదేశించారు. తనిఖీ అనంతరం ఈవీఎం గోదాం రిజిస్టర్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా భద్రపరిచిన ఈవీఎంల వివరాలు, భద్రతా చర్యలకు సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించారు. ఈ తనిఖీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి ్మ, పవన్, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డిఐజి హోదాలో తిరుపతి కమిషనరేట్!

### -ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్





తిరుపతిక్రైమ్ ,సెప్టెంబర్ 23ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో తిరుపతిని కొత్త పోలీస్ కమిషనరేట్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి, శ్రీ సిటీ,పాకాల, పూతలపట్టువరకు ఉన్న ప్రాంతాలు ఈ నూతన కమిషనరేట్ పరిధిలోకి వస్తాయని ప్రాథమిక సమాచారం.ఐపిఎస్ అధికారి హోదాలో కమిషనర్ ఆఫ్ పోలీస్ నేతృత్వంలో ఈ కమిషనరేట్ పూర్తిస్థాయి అధికారాలతో పనిచేయనుంది. ఇంతకుముందు వరకు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పోలీస్ కమిషనరేట్ అయితే ఆయన డిఐజి హోదాలో తొలి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. తిరుపతి తిరుమలకు ప్రతిరోజూ లక్షమంది వరకు యాత్రికులు వస్తుండటం,ముఖ్యంగా కేంద్ర,రాష్ట్ర మంత్రులు, న్యాయాధికారులు, ప్రముఖులు, విదేశాల నుండి ప్రముఖులు పర్యటిస్తుండటంతో వారికి భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు అదనపు పోలీస్ బలగాలు అవసరం ఉంది. ఎంతో సుదీర్ఘ చరిత్ర ఉన్న చిత్తూరు జిల్లాను పోలీస్‌శాఖాపరంగా విభజించి తిరుపతి అర్బన్ పోలీస్ జిల్లాగా 2010లో నెలకొల్పారు. అప్పటివరకు ఎస్పీతో నడిచిన పోలీస్‌శాఖ ఐపిఎస్ అధికారి హోదాలో ఎస్పీ క్రిందకు పోలీసుశాఖ తీసుకువచ్చారు.కమిషనరేట్‌కు ప్రతిపాదనలు సిద్ధమవడంతో డిప్యూటీ కమిషనర్స్ ఆఫ్ పోలీస్ హోదాలో ఐపిఎస్ అధికారులు రానున్నారు. వారికి సహాయకులుగా ఇద్దరు నాన్‌కేడర్ ఎస్పీలు డిసిపి పోస్టులు భర్తీచేయనున్నారు. తిరుపతి కమిషనరేట్ పరిధిలోనూ మరిన్ని కొత్త పోలీస్ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది.

## మరణంలోనూ మమేకమై ..

### భార్య మరణంతో భర్త తుదిశ్వాస ముంగిలిపట్టు దంపతుల మరణం



చంద్రగిరి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:

ఆ దంపతుల ప్రేమానురాగాల జీవిత పయనం మరణంలోనూ మమేకమై ఒక్కటిగా సాగడం హృదయం ద్రవింపజేస్తున్నది. మండల పరిధిలోని ముంగిలిపట్టులో రిటైర్డ్ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ మునిస్వామి నాయుడు భార్య కస్తురమ్మ బుధవారం అనారోగ్యంతో మరణించారు. దాదాపు 5 దశాబ్దాల వారి అన్యోన్య దాంపత్య జీవితం భార్య మరణాన్ని భరించలేని మునిస్వామి నాయుడు (80) గుండె బరువెక్కి భరించలేని వేదనకు గురై ఆగిపోవడంతో తుదిశ్వాస విడిచారు. తాళికట్టిన సమయంలో తను చేసిన వాగ్దానాలలో జీవిత కాలం కలసి వుంటానని చెప్పిన మాటలకు ఆయన మరణంతో నిజం చేశారు. ఆ దంపతుల మరణం గ్రామంలోనే కాకుండా మండలంలోని ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆ ఇద్దరి పవిత్ర ఆత్మ శాంతి పొందాలని ప్రజలు చమ్మగిల్లిన కళ్ళతో ప్రార్థిస్తూ నివాళులర్పించారు.



ఈగల్ పోస్టర్లను, డ్రగ్స్ వద్దు బ్రో బ్యానర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

ప్రభాతవార్త తిరుపతి కలెక్టరేట్,

## చిన్న వర్షానికే శింగనమల వీధి జలమయం...!

### రోడ్డుపై నిలిచిన నీటితో ప్రజలకు నరకయాతన - అధికారుల స్పందన కోసం ఎదురుచూపు





చిట్వేలి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:

చిట్వేలి గ్రామంలోని శింగనమల వీధి ప్రధాన రహదారి చిన్నపాటి వర్షానికే జలమయంగా మారుతోంది. డాక్టర్ చంద్రశేఖర్ ఇంటి నుంచి వైయస్సార్ విగ్రహం వరకు సుమారు 250 మీటర్ల పొడవైన ఈ సిమెంటు రహదారిపై వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పరిస్థితి చూస్తే ప్రధాన వీధి కాస్తా చెరువును తలపించేలా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని ఈ రహదారి పాత బడటంతో పాటు, పక్క వీధుల కంటే తక్కువ ఎత్తు ఉండటంతో వర్షపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో కొద్దిపాటి వర్షానికే రోడ్డంతా నీటితో నిండిపోతోంది. నీరు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.

**విద్యార్థులు,వాహనదారులకు తప్పని ఇబ్బందులు**

ప్రతిరోజూ ఈ మార్గంలో రాకపోకలు సాగించే విద్యా ర్థులు, మహిళలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు నిలిచిన నీటిలోనే ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డుపై గుంతలు నీటిలో కనిపించకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమా దాలకు గురవుతున్నారు. ఇళ్ల ముందు, రహదారి పక్కన నీరు నిలవడంతో స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది.

**దోమల బెడద.. వ్యాధుల భయం:**

రోడ్డు పై నిలిచిన మురుగు నీటితో దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పరిసరాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని వర్షం పడ్డ ప్రతిసారి మాకు ఈ ఇబ్బంది తప్పడం లేదని, అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఎదురవుతున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు శింగనమల వీధిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, రహదారిని ఎత్తు పెంచడంతో పాటు వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఇద్దరిపై ఆరోపణలు... ఒకరిపైనే చర్య!

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ఏం జరుగుతుంది? ఈ ఆసుపత్రిలో జవాబుదారి తనం పూర్తిగా కనుమరుగైంది. ఇక్కడ వైద్య మాట దేవుడెరుగు? కనీసం సర్టిఫికేట్ కావాలన్నా మామూలు చెల్లించుకోవా ల్సిందే. చివరకు సిబ్బంది కూడా పాతికో పరకో ఇవ్వనిదే సంతకాలు జరగవు.శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో 'ఎన్టిఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో' నిధులు పక్కదారి పట్టించి బంధువుల పేరుతో డ్రా చేసుకున్నారని రికార్డు పరంగా దొరికినా పోలీసు కేసులతోనే సరిపెట్టడం గమనిస్తే ప్రభుత్వ పని తీరుకు నిదర్శనం అని జనం చర్చించుకుంటున్నారు.

**ఇద్దరు దొరికితే ఒకరిపైనే చర్యా? మరొకరి మాటేమిటి?:**

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో అవకతవకలకు పాల్పడినట్లు జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసన్న, పోస్టుమార్టం విభాగానికి చెందిన ఉద్యోగి చందు ఇద్దరు దొరికిపోయారు. వారి నుంచి లక్షల్లో సొమ్ములు కూడా వసూలు చేసారు.అయితే విచారణ పోలీసు కేసుతోనే సరిపోయింది. అయితే ఇక్కడ అవకతవకలు జరిగినపుడు ఆసుపత్రి సూపరింటెంటెండ్ పై స్థాయి అదికారులకు సమాచారం ఇచ్చి వారి సూచనల మేరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు. అవినీతికి పాల్పడినపుడు విచారణకు బదులు ముందు సమాచారం బయటపడకుండా ఎందుకు రాజకీయంగా పంచాయతీలను సూపరింటెండెంట్ నిర్వహించారు? ఆయన ప్రభుత్వ అధికారా? లేక రాజకీయ ప్రతినిధా? అనే చర్చ చోటు చేసుకుంది. ఇక అవకతవకలకు పాల్పడినది ఇద్దరుఅయితే ఒకరిని సస్పెండ్ చేసారు? మరొకరిని తమ కారు డ్రైవర్‌గా తమతోనే తిప్పుకుంటుండటం పోలీసులు కూడా చర్యలు తీసుకోకపోవటంలో ఆంతర్యమిమిటని చర్చించు కుంటున్నారు. ఇదెక్కడి న్యాయమంటున్నారు. కాగా విచారణలో బ్లడ్‌బ్యాంక్ ఉద్యోగి సుభాష్



పేరుతో రూ.90వేలు నమోదు అయినట్లు తేలటం ఆతన్ని సస్పెండ్ చేసారు.మరి పోస్టుమార్టం ఉద్యోగిని ఎందుకు తమతో తిప్పుకుంటున్నారనే విమర్శలు రాజ్యమేలుతున్నాయి?

**డిసిహెచ్ ఎందుకు స్పందించలేదు?:**

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి గతంలో విధానపరిషత్‌లో ఉండేది.జగన్ జమానాలో దీనిని డిసిహెచ్ పరిధిలోకి తెచ్చారు.ఆయన హోయాంలో ఈ ఆసుపత్రిలో మొదటి అంతస్థును రోగుల కోసం రూ.15కోట్లు వెచ్చించి నిర్మిస్తే ప్రారంభోత్సవమే కాలేదు. నిర్మాణాలు నాసిరకం. వీటిని నేడు డాక్టర్లు,నర్సుల రెస్ట్‌రూంలుగా ఉపయోగించుకుంటున్నారు.దీనిపై విచారణలు లేదు. ప్రస్తుతం నడుస్తున్న కథంలో ఇద్దరు ఉద్యోగులు పక్కాగా అవకతవకలకు పాల్పడినట్లు రికార్డులు సాక్ష్యం చెబుతున్నా డిసిహెచ్ ఎందుకు స్పందించరు? ఇందులో మర్మమేమిటో జనాలకు అర్థం కావటం లేదు. ఈ అంశానికి సంబంధించి డిసిహెచ్‌ను వివరణ కోరితే త్వరలోనే విచారణ కమిటి వేస్తామన్నారు. ఇది జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని కమిటిని నియమించాల్సి ఉందన్నారు. విచారణ కమిటిలో అన్ని నిగ్గు తేలుతాయని వివరించారు. మరి కేసు నమోదు చేసి పది రోజులు గడుస్తున్నా పోలీసుల విచారణతోనే సరిపెడుతున్నారు తప్ప శాఖాపరంగా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదనేది డాలర్ మిలియన్ల ప్రశ్నగా మారింది.

# శ్రీకాళహస్తి డివిజన్

## అల్పపీడనం ప్రభావ వర్షాలతో... ఏరువాక సాగులో రైతులు

బుచ్చినాయుడు కండ్రిగ సెప్టెంబర్ 23 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎల్ నీనో ప్రభావం వలన తీవ్ర వర్ష ప్రభావం నెలకొని ఎండల తీవ్రతతో ప్రజలు , రైతన్నలు ఆందోళన పడ్డారు. కానీ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్లోని పలు ప్రాంతాలతో పాటు బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో రెండు రోజుల నుంచి ఓ మోస్తారు వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఎండల తీవ్రత సడలిపోయి చల్లని వాతావరణం నెలకొంది. వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆనందంతో ఏరువాక సాగు: సజావుగా సాగుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాలలో వర్షాలు పడటం వలన శ్రీశైలం ప్రాజెక్టు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు డ్యాముల్లోని నీటిమట్టం రోజురోజుకు పెరుగుతున్నాయని వీటికి అనుబంధం ఉన్న సాగునీటి ప్రాజెక్టులు కూడా చేరుకొని వ్యవసాయ సాగుకు దోహదపడతాయని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు తెలుగు గంగ ప్రాజెక్టు పుణ్యమని పరిసర ప్రాంతాల చెరువులలో గంగ నీరు నిలువలు కొంతమేరకు ఉన్నాయి. అల్పపీడన ప్రభావంతో మండలంలో కురుస్తున్న వర్షాలకు ఊరట లభించి చెరువులకు వర్షపు నీరు చేరుకుంటున్నాయి. అన్నదాతలు వ్యవసాయ సాగు చేసేందుకు సన్నద్దమవుతున్నారు.

## సిబియన్ పాలనలో ప్రగతి పథంలో పట్టణాలు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: గత వైసిపి పాలనా కాలంలో నిర్లక్ష్యానికి గురైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పురపాలక వ్యవస్థను బాగు చేసి ముందుకు తీసుకెళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో పట్టణాలు ప్రగతి పథంలో పరుగులు తీస్తున్నాయని వెన్నెల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,తెలుగుదేశం పార్టీ బిసివిభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యం.ఉమేష్‌రావు కొనియాడారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పురపాలక సంఘాలు మరియు నగరపాలక సంస్థల పరిధిలో మౌళిక సౌకర్యాల అభివృద్ధి ద్వారా వస్తవంతో నిండిన పరిశుభ్రమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా చేసుకొని ఎన్డీయే కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులకు చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వర్చువల్ పద్దతిలో శంఖుస్థాపన చేయడం శుభ పరిణామం అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డి.వి.నారాయణ, కోట చంద్రశేఖర్, గంగనపల్లి రమేష్, సులేమాన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ కోటా టీచర్లపై... దాడిని ఖండించిన టీడీపీ



శ్రీకాళహస్తి సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై విజయవాడ శాప్ కార్యాలయం వద్ద జరిగిన దాడిని ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు పీలేరు నియోజకవర్గ పరిశీలకులు మసాపేట సుబ్బయ్య పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ, వినతిపత్రం ఇవ్వడానికి వెళ్ళిన టీచర్లపై వైసీపీ నేతలు అవినాష్, నాగార్జున వారి అనుచరులు కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేయడం దుర్మార్గమని అన్నారు.

## పోషణ మాసోత్సవాలు పై అవగాహన



శ్రీకాళహస్తి రూరల్, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని ఊరందూరు రోడ్డులో గల అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్స వాలు ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ శాంతి దుర్గ మాట్లాడుతూ సమతుల్య ఆహారం, పౌష్టికాహారం, పరిశుభ్రత మరియు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పోషణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు కె. శాంతకుమారి, కె. వెంకటరత్నమ్మ, ఎస్. దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు.

## అరకోణంలో ప్రతిభ చాటిన శ్రీకాళహస్తి విద్యార్థులు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: చెన్నై రాష్ట్రం అరకోణంలో జరిగిన రోబో జెన్నిక్స్ 2026 నేషనల్ లెవల్ ఏఐ రోబోటిక్స్ పోటీల్లో ఎంజీఎం స్కూల్ విద్యార్థులు ఫస్ట్ ప్రైజ్ సాధించారు. దేశవ్యాప్తంగా 288 స్కూళ్లు ఈ పోటీల్లో పాల్గొనగా, 17 స్కూళ్లు వివిధ విభాగాల్లో ఫస్ట్ ప్రైజ్ సాధించాయి. అందులో ఎంజీఎం విద్యార్థులు ఎగ్జామినేషన్ విభాగం బి కేటగిరిలో ఫస్ట్ ప్రైజ్ కైవసం చేసుకున్నారు. విద్యార్థులకు రోలింగ్ కప్ మరియు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంజీఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు గుడ్లూరు మయూర్, ఐశ్వర్య లక్ష్మి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యార్థులు త్వరగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఎంజీఎం ప్రధానోపాధ్యాయులు ఇ.ముని రత్నం నాయుడు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సొంతింటి కలకు...దరఖాస్తుల స్వీకరణ షురూ

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో అర్హులైన పేదల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని హౌసింగ్ ఏఈ రమణయ్య పత్రికల వారికి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సొంతంగా ఖాళీ జాగా ఉండి,ఇల్లు కట్టుకోవాలని అనుకుంటున్నారా? అయితే మీకు ప్రభుత్వం ఉచిత సబ్సిడీతో పాటు హౌసింగ్ లోన్ సౌకర్యం కల్పిస్తామని, అదేవిధంగా ఇప్పటి వరకు జాగా లేని, పట్టా లేని నిరుపేద కుటుంబాలకు కొత్త ఇంటి పట్టా ఇచ్చేందుకు ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుంటుందని ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకురమణయ్య9440402395,హౌసింగ్‌నాగరాజ్9032975516 సంప్రదించాలన్నారు.

## దళిత యువకుడిపై ఎస్ఐ దాష్టీకం?

### స్టేషన్‌కు రమ్మని పిలిచి లాఠీతో కొట్టారంటూ బాధితుడి ఆరోపణ
### మొబైల్ లాక్కొని లోపలికి తీసుకెళ్లి దాడి చేశారంటూ ఆవేదన

**తిరుపతి-ప్రభాతవార్తన్యూస్ నెట్‌వర్క్:**



తిరుపతి జిల్లా భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో దళిత యువకుడిపై ఎస్సై లాఠీతో దాడి చేశారంటూ ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. రెండు నిమిషాల్లో స్టేషన్‌కు వచ్చి వెళ్లాలని పోలీసులు ఫోన్ చేయడంతో ఏం జరిగిందో తెలియక హడావుడిగా స్టేషన్‌కు వెళ్లిన తనపై ఎస్సై చేయిచేసుకున్నారని బాధిత యువకుడు ఆరోపిస్తున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా ఆదివారం డీజే వద్ద హంగామా చేశానంటూ తనపై ఎవరో ఫిర్యాదు చేశారని, ఈ విషయమై బుధవారం మధ్యాహ్నం పోలీసులు ఫోన్ చేసి వెంటనే భాకరాపేట స్టేషన్‌కు రావాలని చెప్పారని తెలిపాడు. దీంతో స్టేషన్‌కు వెళ్లి సార్.. ఏమైంది? నన్నెందుకు పిలిపించారు? అని అడిగేలోపే ఎస్సై తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను లాక్కొని లోపలికి తీసుకెళ్లారని ఆరోపించాడు. అనంతరం లాఠీతో తనను కొట్టారని, ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించినా వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా డీజే వద్ద హంగామా చేశావంటూ ఎస్సై దాడి చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తనపై జరిగిన దాడితో తీవ్రంగా భయాందోళనకు గురయ్యానని తెలిపాడు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని బాధితుడు, అతని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలగకుండా ఘటనపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## అంబులెన్స్‌లోనే ప్రసవం...తల్లీబిడ్డ క్షేమం



శ్రీకాళహస్తి రూరల్, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం అబ్బా బాట్లపల్లి గ్రామానికి చెందిన కల్పన (20) అనే మహిళ అంబులెన్స్‌లోనే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అత్యవసర సమయంలో 108 సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడారు. ఈ ఘటనలో గర్భిణి అయిన కల్పన పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన ఈఎంటీ సి. అమరనాథ్, పైలట్ ఎం. మునిబాలాజీ ఘటనా స్థలానికి చేరుకుని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యం లోనే ప్రసవం చేయాల్సి వచ్చింది. సురక్షితంగా ఆడ శిశువు జన్మించింది. మెడ చుట్టూ తాడు చుట్టుకున్నప్పటికీ నైపుణ్యంగా ప్రసవం చేశారు.అనంతరం తల్లీబిడ్డలను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

## బాలుర ఉన్నత పాఠశాలకు ఫ్యాన్లు వితరణ



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఆర్‌పిబియస్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు రూ.1.2లక్షల విలువ చేసేఫ్యాన్లను వితరణగా అందించారు. బుధవారం వారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్యకు వాటిని అందించారు. దాతలు అందించిన సహకారంతో ఎంతో కాలంగా ఆడిటోరియంలో గాలి లేకుండా ఇబ్బంది పడే ప్రేక్షకులకు ఎంతో సౌకర్యంగా మారింది. ఈ నేపథ్యంలో పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు తాళంకి వెంకటేశ్వర్లు, నాగరాజుల కుటుంబాలకు చెందిన వారు అమెరికాలో ఉంటున్నారు.వారు వినీల, వికాస్, సుహాస్, శ్రావ్య,సత్యలు తమ కుటుంబసభ్యులు చదివిన పాఠశాల ఆడిటోరియంలో రూ.1.2లక్షల విలువ చేసే ఫ్యాన్లు 22ని అందించారు. వీటిని సరస్వతి బాలసుబ్రమణ్యం పేరుతో ఏర్పాటు చేసిన ఆడిటోరియంలో ఏర్పాటు చేసారు. పూర్వ విద్యార్థుల పిల్లలు సేవా గుణాన్ని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రదానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, ఎంఇఓ భువనేశ్వరి, రిటైర్డ్ ఎంఇఓ భాస్కర్ తదితరులు ఎపాల్గొన్నారు.

## పాఠశాల కమిటి ఎన్నికలకు సన్నాహాలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో తల్లిదండ్రుల కమిటిల ఎన్నికలకు చెందిన నోటిఫికేషన్ జారి చేయటంతో పాఠశాలల్లో సందడి చోటు చేసుకుంది. ఈ ఏడాది ఎన్నికల ఏడాదిగా ప్రకటించిన ప్రభుత్వం రాజకీయ ఎన్నికలకు ముందుగానే విద్యాకమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశించింది. దాంతో పాఠశాలల్లో సందడి చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి విద్యాసబ్‌డివిజన్లో 145 పాఠశాలలు న్నాయి. ఈ నెల 25న ఓటరు జాబితా ప్రకటన 29న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎన్నికలు నిర్వహణకు ఆదేశించారు. ఈమేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించాల్సి ఉంది. ఎన్నికైన కమిటితో అదేరోజు మధ్యాహ్నం 3గంటలకు మొదటి సమావేశం నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి భువనేశ్వరి మాట్లాడుతూ పాఠశాలల్లో కమిటీల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేయమని ఆదేశించినట్లు వివరించారు.

## మేము చేపట్టిన ప్రగతిని పరిశీలించండి

### -ఎంఎల్‌ఏకు టౌన్‌బ్యాంకు ఆహ్వానం



శ్రీకాళహస్తి రూరల్,సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: మీరు మామీద పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా స్వల్ప కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని ఒక్కసారి మీరు సర్వజన సమావేశానికి హాజరై పరిశీలించాలని బుధవారం శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు చైర్మెన్ షేక్ ఖాదర్ బాషా, వారి సహచరులు ఊరందూరులో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిని ఆహ్వానించారు.బ్యాంకు మహాజన సభ ఈ నెల 25 శుక్రవారం ఉదయం శ్రీ సరస్వతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆయనతో పాటు సభ్యులు సిఇఓ ధనంజయులున్నారు. ఈ సందర్భంగా గతంలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సూచించిన అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసినతీరును వారు వివరించారు.

## రక్తహీనత నుంచి పిల్లలను కాపాడుకుందాం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: నులిపురుగులను తరిమేద్దాం రక్తహీనత నుండి పిల్లలను కాపాడుకుందామని శ్రీరామ్ నగర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా.బాలు పిలుపు నిచ్చారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు, కౌమార బాలబాలికల్లో నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం, అలసట, ఆకలి తగ్గడం, కడుపునొప్పి తదితర సమస్యలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న పిల్లలు, కౌమార బాలబాలికలకు వయస్సుకు అనుగుణంగా ఆల్బెండజోల్ మాత్రలను ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో అందించనున్నామన్నారు. సెప్టెంబర్ 25న ఈ కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, ఇంటర్మీడియట్ కళాశాలలు, విద్యాసంస్థల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. నులిపురుగుల నివారణ కోసం అర్హులైన ప్రతి చిన్నారి ఆల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా తీసుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని డా.బాలు కోరారు.

## సాగు, మంచినీటి సమస్యలను పరిష్కరించాలి: సీపీఐ



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నెలకొన్న సాగునీరు, మంచినీటి సమస్యలను తక్షణమే పరిష్కరించి రైతులు, ప్రజలకు ఉపశమనం కల్పించాలని సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం ఆర్‌డిఓ కు వినతి పత్రం అందించారు. సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలు గ్రామాల్లో మంచినీటి సమస్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన అన్నారు. నీటి కొరత కారణంగా రైతులు పంటలు సాగు చేసుకునే పరిస్థితి లేక నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నీటి సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించాలని, చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరులను సక్రమంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి" అని జనమాల గురవయ్య అన్నారు. సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన వినతి పత్రాన్ని శ్రీకాళహస్తి ఆర్డీవో కి అందజేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల కార్యదర్శి వై.ఎస్. మణి,ఏర్పేడు మండల కార్యదర్శి సర్దార్ శివకుమార్, శ్రీకాళహస్తి రూరల్ మండల కార్యదర్శి మించల శివకుమార్, తొట్టంబేడు మండల కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, మల్లికార్జున, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చందు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పోషణ అవగాహన కార్యక్రమం



తొట్టంబేడు, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ అంగన్ వాడీ కేంద్రంలో పోషణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ తరఫున ప్రోగ్రామ్ అసోసియేట్ వి.లక్ష్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సూపర్ వైజర్ మరియమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లులు, చిన్నారులకు పోషకాహార ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. పోషకాహార లోపం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు, వాటి నివారణ చర్యలు, సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు, గ్రామానికి చెందిన తల్లులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న హార్టికల్చర్ హబ్ ప్రారంభం : వాడపల్లి



తొట్టంబేడు, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త : కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుచే అక్టోర్ 2న రాయసీమ హార్టికల్చర్ హబ్‌ను ప్రారంభిస్తున్నట్లు వ్యయసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాడపల్లి జయచంద్రనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. రాయలసీమలో సుమారు 40వేల కోట్లతో హార్టికల్చర్ హబ్, 60వేల కోట్లపైన ప్రవేటు పెట్టుబడుల ద్వారా నిధులు రానున్నాయని అన్నారు. ఉమ్మడి జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలో ఈ ప్రాజెక్టు అమలుచేయనున్నారన్నారు. కేంద్ర సహాయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్ళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి ఆయన కొనయాడారు.

## బెటాలియన్ శిక్షణ సిబ్బందికి సమాచార దీపికలు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త : పోలీసు శాఖలో కొత్తగా విధుల్లోకి ప్రవేశిస్తున్న శిక్షణ సిబ్బందికి ఉపయోగపడేలా రూపొందించిన సమాచార దీపికను శ్రీకాళహస్తి తొమ్మిదో పోలీసు బెటాలియన్‌లో పంపిణీ చేశారు. రాష్ట్ర డీజీపీ హరీష్ గుప్తా ఆదేశాల మేరకు రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఈ సమాచార దీపికను రూపొందించారు. ఇందులో పోలీసు సిబ్బందికి సంబంధించిన సేవా అంశాలు, ముఖ్యమైన ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలు, ఇతర అవసరమైన సమాచారాన్ని పొందుపరిచారు. తొమ్మిదో బెటాలియన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బెటాలియన్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు గురజాల శ్రీనివాసులు శిక్షణలో ఉన్న సిబ్బందికి సమాచార దీపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, శిక్షకులు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## మద్యం సిండికేట్ కథ...కంచికి

### పెట్టుబడి పెట్టిన వారికి చేదు అనుభవం!

తొట్టంబేడు, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో మద్యం సిండికేట్ కథ కంచికి చేరింది. పెట్టుబడి పెట్టిన వారికి సగం సొమ్ములు మాత్రమే దక్కింది. దాంతో పెట్టుబడి పెట్టిన వారి ఆర్థిక స్థితి ఆగమ్యగోచరంగా మారింది. రెండేళ్లుగా సాగిన మద్యం సిండికేట్ వ్యవహారం ఇప్పుడు ముగిసినట్లు చర్చించుకుంటున్నారు. రెండేళ్ల క్రితం నియోజకవర్గ పరిధిలోని దాదాపు అన్ని మద్యం దుకాణాలు (రెండు దుకాణాలు మినహా ఒకటి స్థానిక ప్రముఖ వైద్యుడు, మరొకటి తిరుపతికి చెందిన వ్యక్తి సిండికేట్‌లో చేరకుండా విడిగా నిర్వహిస్తున్నారు) ఒకే గొడుగు కిందకు వచ్చి సిండికేట్ గా ఏర్పడ్డాయి. తొట్టంబేడు మండలానికి చెందిన కూటమి నేతకు దీని నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఈ సిండికేట్‌లో 1 శాతం వాటా కావాలంటే రూ.15 లక్షల చొప్పున పెట్టుబడి తీసుకోగా, మొత్తం రూ.15 కోట్లతో సిండికేట్ ఏర్పాటైనట్లు ప్రచారం జరుగుతోంది. కొంతకాలం క్రితం 1 శాతం వాటాదారులకు అంటే రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టిన వారికి రూ.8 లక్షలు (నెలకు లక్ష చొప్పున) తిరిగి ఇచ్చినట్లు చర్చించుకుంటున్నారు. మిగిలిన పెట్టుబడి అసలు, వడ్డీ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసిన పెట్టుబడి దారులకు ఇటీవల చేదు అనుభవం ఎదురైనట్లు సమాచారం. సిండికేట్ నిర్వహణను మండల స్థాయి నేతలకు అప్పగించడం వల్ల ముఖ్యంగా రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలోని దుకాణాల నిర్వహణలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్రాందీ షాపుల్లో భారీ లాభాలు వస్తాయని ఆశించి పలువురు నాయకులు, అధికార పార్టీ కార్యకర్తలు అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టినట్లు చెబుతున్నారు.ఇంత జరుగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నామంటూ వాపోతున్నారు. గతంలో కూడా 'సిండికేట్' ఏర్పాటు చేయటం నష్టాలు వచ్చాయని మూసివేయటం గా మారింది.

## ఏపీని కరువు రాష్ట్రంగా ప్రకటించాలి: ఏఐకేఎంఎస్ డిమాండ్



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వెంటనే కరువు రాష్ట్రంగా ప్రకటించి, కరువు పరిస్థితులతో నష్టపోతున్న రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాళహస్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ ధర్నాలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు పి.వెంకటరత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా నెలకొన్నాయని అన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. జాకీర్ మాట్లాడుతూ వాగివేడు పంచాయతీ పరిధిలోని ఎల్లంపల్లి గిరిజనులు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తాగునీటి ట్యాంకును మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు చంగల్ రాయులు, ఐఎఫ్‌టి యునాయకులు సురేష్, బత్తయ్య, ఢిల్లీప్ తదితరులు, ఎల్లంపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

## సతీష్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



ఏర్పేడు, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం మునగలపాలెం గ్రామంలో ఇటీవల పాముకాటుతో మరణించిన రావూరి సతీష్ నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు, సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు, మోహన్ నాయుడు, బత్తల గిరి నాయుడు, పూల హేమాక్షి, శశి, బాబు, సురేంద్ర, చిరంజీవులు నాయుడు, క్రిష్ణప్ప మొదలియార్, గుణా యాదవ్, రాచేటి సుబ్రమణ్యం, కెకె రమణ, రామదాసు, వై మనోహర్ మరియు మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వహించాలి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త :తిరుపతి నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల విధుల నిర్వహణపై నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ జయకృష్ణ అధ్యక్షతన ఆర్వో, ఏఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆర్వో, ఏఆర్వోల నియామకానికి ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమైనదని తెలిపారు. ఆర్వో, ఏఆర్వోల పనితీరుపైనే ఎన్నికల విశ్వసనీయత ఆధారపడి ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణపై అధికారులు అందరికీ తగిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సీనియర్ అధికారులు తమ కింద పనిచేసే సిబ్బందికి సరైన మార్గదర్శకత్వం చేయాలని తెలిపారు. మొదటి విడతగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం వెబ్ సైట్ ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తాజా సూచనలతో అప్ డేట్ గా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శారదా దేవి, ఉప కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ సురేష్ బాబు, ఏసిపి మూర్తి మరియు వివిధ విభాగాల అధికారులు ఆర్వోలు పాల్గొన్నారు.